క్లుప్తంగా

డీఎస్పీగా శ్రీనాథ్



కుప్పం: కుప్పం డివిజన్ మెట్టమొదటి డీఎస్పీగా శ్రీనాథ్ సోమవారం స్థానిక అర్బన్ సీఐ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. రెండేళ్ల క్రితంగా కుప్పం ప్రత్యేక డివిజన్‌గా ఏర్పాటు చేయడంతో రెవెన్యూ డివిజన్ అధికారులు ఇప్పటికే పనిచేస్తున్నారు. అయితే పోలీస్ డివిజన్‌కు ఇప్పటి వరకు డీఎస్పీలు రాలేదు. ఈ నేపథ్యంలో పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో పనిచేస్తున్న శ్రీనాథ్ ఇక్కడికి డీఎస్పీగా బదిలీపై వచ్చారు. ఆయనను మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.

తహసీల్దార్‌గా నారాయణస్వామి



సదుం: తహసీల్దార్‌గా నారాయణస్వామి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా నుంచి బదిలీపై ఆయన ఇక్కడికి వచ్చారు. సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా వ్యవహరించాలని, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీటీలు కుమార్, ప్రసాద్ పాల్గొన్నారు. ఇదలా ఉంచితే, ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్ కర్నూలుకు బదిలీ అయ్యారు.

వాటర్‌షెడ్ పనులపై తనిఖీ



మాట్లాడుతున్న డీఆర్‌డీ సురేష్

సదుం: మండలంలోని చెరుకువారిపల్లె ప్రాజెక్టు పరిధిలో వాటర్‌షెడ్‌లో చేసిన పనులను సోమవారం సాయంత్రం నుంచి సామాజిక తనిఖీ బృందం పరిశీలించనున్నట్టు డీఆర్‌డీ సురేష్ తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరుకువారిపల్లె, జోగివారిపల్లె, తాటిగుంటపాలెం, కంభంవారిపల్లెలో ఈ తనిఖీలు చేయనున్నట్టు చెప్పారు. సహజ వనరుల అభివృద్ధి కోసం 110 పనులకు రూ.1.74 కోట్లు, 400 మందికి వ్యవసాయ పనిముట్ల పంపిణీకి రూ.49.29 లక్షలను ఖర్చు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

యాచకులకు ఆహార పొట్లాల వితరణ

పలమనేరు: పట్టణంలోని ఆలయాల వద్ద యాచకులకు దళిత నాయకుడు చిన్న సోమవారం ఆహార పొట్లాలను అందజేశారు. తన కున్న దాంట్లో కొంత వెచ్చించి నిర్భాగ్యులకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఇలాంటి వితరణ చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

సచివాలయం-2 ప్రారంభం



సచివాలయం-2ను ప్రారంభిస్తున్న చైర్మన్

కుప్పం: మున్సిపాలిటీ పరిధిలో సచివాలయం -2 ను సోమవారం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ ప్రారంభించారు. 16, 17, 22వ వార్డులకు సంబంధించి పాలనా వ్యవస్థ ఈ సచివాలయంలో కొనసాగుతుందని ఆయన చెప్పారు. ప్రస్తుతం పార్కు వెనక ఉన్న సచివాలయంలో అన్ని వార్డుల పాలన కొనసాగేది. ప్రస్తుతం టీబీ రోడ్డులోని పంచాయతీరాజ్ శాఖ అతిథి గృహం ఖాళీగా ఉండటంతో ప్రస్తుతం 2వ సచివాలయాన్ని ప్రారంభించారు.కార్యక్రమంలో రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్, స్థానిక కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల ఊరేగింపు



విరూపాక్షమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న రామచంద్రనాయుడు దంపతులు

పూతలపట్టు: మండలంలోని పేటమిట్టలో శ్రీ కోదండరామస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా తొలిరోజు సోమవారం ఘనంగా సమస్త దేవతల విగ్రహాలను గ్రామస్తులు ఊరేగించారు. ఉదయం దేవస్థాన చైర్మన్ గల్లా రామచంద్రనాయుడు దంపతులు గ్రామంలోని విరూపాక్షమ్మ అమ్మవారి గుడి వద్దకు వెళ్లి గణపతి పూజ, పంచగవ్యప్రాసన, దీక్షాధారణ కార్యక్రమాలను వేదపండితులతో నిర్వహించారు. సాయంత్రం తీర్థ ప్రసాదాలు స్వీకరించి, పందరి భజన, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. సర్పంచ్ గల్లా రాధాకృష్ణ, ట్రస్ట్ సెక్రటరీ రాజశేఖర్, ట్రెజరర్ రామనాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యా సంస్కరణలతో సత్ఫలితాలు





రొంపిచెర్లలో ఆదర్శ పాఠశాల ప్రారంభోత్సవంలో పూజ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, పులిచెర్ల: గురుకుల పాఠశాలకు భూమి పూజ చేస్తున్న మంత్రి, నారాయణస్వామి

- రూ.2.57 కోట్లతో ఆదర్శ పాఠశాల వసతి గృహం
- రూ.25 లక్షలతో సీసీ రోడ్డు
- పేద విద్యార్థులు చదువుల్లో రాణించాలి
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల: విద్యారంగంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకువచ్చిన ప్రత్యేక సంస్కరణలు సత్ఫలితాలిస్తున్నాయని రాష్ట్ర అటవీ, విద్యుత్, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. రూ.2.57 కోట్లతో నిర్మించిన ఆదర్శ పాఠశాల బాలికల హాస్టల్, రూ.25 లక్షలతో వేసిన సీసీ రోడ్డును సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పేద విద్యార్థుల కోసం ముఖ్యమంత్రి నాడు–నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకంటే మిన్నగా తీర్చిదిద్దారన్నారు. విద్యార్థులకు విద్యాకానుక ఇవ్వడం మొదలుకుని స్కూళ్లలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వడంతో వాటి రూపురేఖలు సమూలంగా మారిపోయాయన్నారు. అంతే కాకుండా డిజిటల్ విద్యాబోధన, జగనన్న గోరుముద్ద..ఇంగ్లిష్ మీడియం..ఇవన్నీనూ దేశంలోని ఇతర రాష్ట్రాలను సైతం ఆకర్షించాయన్నారు. రొంపిచెర్ల మండలానికి ప్రభుత్వం ఆదర్శ పాఠశాలను మంజూరు చేయడంతో తిరుపతి– మదనపల్లె జాతీయ రహదారిలో బాలికల వసతి గృహన్ని నిర్మించామన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఆదర్శ పాఠశాలను పూర్తి స్థాయిలో పనిచేస్తుందన్నారు. పేద విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకుని చదువుల్లో రాణించాలని పిలుపునిచ్చారు.



ఆదర్శ పాఠశాల సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మంత్రి

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షన్మోహన్, ఆర్‌వీఎం పీఓ పెద్దిరెడ్డి వెంకటరమణా రెడ్డి, ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు దేవులపల్లె హరినాథరెడ్డి, ఎంపీడీఓ రాజేంద్ర, వైస్ ఎంపీపీ విజయశేఖర్, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఇబ్రహీంఖాన్, నాయకులు డాక్టర్ శ్రీనాథ్, కోటా వెంకటరమణ, విజయభాస్కర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, అలీం ఖాన్, యుగంధర్ రెడ్డి, కమలాకర్ రెడ్డి, హరికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సమస్య తీర్చాం

పులిచెర్ల(కల్లూరు): గ్రామాల్లో లో ఓల్టేజీ సమస్య లేకుండా చేయడానికి అవసరమైన చోట సబ్ స్టేషన్లు ఏర్పాటు చేశామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని వెంకటదాసరపల్లె, దిన్నెపాటి దళితవాడ, దేవళంపేట, 102 ఇ.రామిరెడ్డిగారిపల్లె, కొమ్మిరెడ్డిగారిపల్లె, చెరువు ముందరపల్లెలో ఒక్కొక్కటి ఒకొక్కటి రూ.3.29కోట్లతో నిర్మించిన నూతన విద్యుత్ సబ్ స్టేషన్లను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. సబ్‌స్టేషన్ల ఏర్పాటుతో నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందన్నారు.



పులిచెర్ల: 102 ఇ.రామిరెడ్డిగారిపల్లె వద్ద సబ్‌స్టేషన్ ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

అలాగే దరఖాస్తు చేసుకున్న వెంటనే రైతులకు వ్యవసాయ సర్వీసులను మంజూరు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కోఎస్ఈ కృష్ణారెడ్డి, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యులు పోకల అశోక్‌కుమార్, రెడ్డీశ్వరరెడ్డి, హేమసుందరెడ్డి పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల, కళాశాలకు భూమి పూజ

మండలంలోని మతుకువారిపల్లె వద్ద రూ.27.88కోట్లతో సాంఘిక సంక్షేమ గురుకుల (బాలికలు)పాఠశాల, కళాశాల భవనాల నిర్మాణానికి ఉపముఖ్యమంత్రి నారాయణస్వామితో కలిసి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భూమి పూజ చేశారు. ఐదవ తరగతి నుంచి ఇంటర్‌మీడియెట్ వరకు దాదాపు 650 విద్యార్థులు ఇక్కడ చదువుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్, పార్టీ మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు హేమసుందరరెడ్డి, సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీ ఉషారాణి, చంద్రశేఖరరెడ్డి, గోవింద రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మృత్యుంజయేశ్వరస్వామి సేవలో జెడ్పీ చైర్మన్



ఆలయం వద్ద జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, జెడ్పీటీసీ దామోదరరాజు తదితరులు

చౌడేపల్లె: స్థానిక శ్రీ అభీష్టద మృత్యుంజయేశ్వర స్వామిని జెడ్పీ చైర్మన్ జి.శ్రీనివాసులు సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి స్వాగతం పలికారు. ఆలయంలో వేదపండితులు రాజశేఖర దీక్షితుల ఆధ్వర్యంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేయించారు. మాఘమాసం సందర్భంగా ఆలయంలో అగండ్లం ఏర్పాటు చేసేందుకు వచ్చినట్లు చైర్మన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని, రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దేవుడు, ప్రజల దీవెనలు ఉండేలా ఆశీర్వదించాలని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బోయకొండ కమిటీ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సలహాదారుడు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీలు శ్రీరాములు, సర్పంచులు వరుణ్ భరత్, రవికుమార్, కుమార్‌రెడ్డి, స్వర్ణమ్మ, అమరనాథ్, భార్గవ్, రమేష్, పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, మాజీ ఎంపీటీసీ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పార్టీని గెలిపిద్దాం



నాయకులు, కార్యకర్తలతో ఎంపీపీ యువరాజు

వి.కోట: రాబోవు ఎన్నికల్లో కలిసికట్టుగా సమన్వయ కృషితో వైఎస్సార్‌సీపీని అధిక మెజారిటీతో గెలిపించుకుందామని ఎంపీపీ యువరాజు అన్నారు. సోమవారం ఆయన మండలంలోని పెద్దభర్నిపల్లె, పాముగానిపల్లె, బైరుపల్లె పంచాయతీల పరిధిలోని ముఖ్య నేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఏ గౌస్, పార్టీ మండల కన్వీనర్ బాలగురునాథ్, సచివాలయాల కన్వీనర్ కిషోర్‌రెడ్డి, ఎంపీటీసీ కమల్, నాయకులు ప్రతాప్‌రెడ్డి, సురేంద్ర గౌడు, మురళి, రమేష్, పూలనాగ, శంకర్‌రెడ్డి, కృష్ణమూర్తి, సుధాకర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృత్తి విద్యపై విద్యార్థులకు అవగాహన



ఇండస్ట్రియల్ విజిట్ కార్యక్రమంలో విద్యార్థులు

రామకుప్పం: విద్యార్థులు వృత్తి విద్యపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రామచంద్రన్ అన్నారు. వృత్తి విద్యా కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం ఆదర్శ పాఠశాల విద్యార్థులకు స్థానిక సచివాలయం, ఆటోమొబైల్స్ వాహనాల ట్రేడింగ్ రంగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వృత్తి విద్యా శిక్షకులు రామాంజనేయులు, రామకృష్ణ మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే వృత్తి విద్యపై అవగాహన కలిగి ఉండి నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలన్నారు. వృత్తి విద్యపై అవగాహన కల్పించేందుకు ఇండస్ట్రియల్ విజిట్ పేరిట క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించినట్లు తెలిపారు.

గ్రామదేవత మారెమ్మ కృష్ణశిల ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న సుధాకర్‌మూర్తి, భక్తులు

చౌడేపల్లె: మండలంలో బత్తలాపురం రోడ్డులోని చౌడేపల్లె చెరువు మొరవ వద్ద సోమవారం గ్రామదేవత మారెమ్మ కృష్ణశిల విగ్రహాన్ని భక్తిప్రపత్తులతో ప్రతిష్ఠించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేశారు. విజయవాణి ప్రింటర్స్ అధినేత నాయుని సుధాకర మూర్తి సహకారంతో మారెమ్మ కృష్ణశిలలో ఏర్పాటు చేశారు. ప్రతిష్ఠాపన అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. వివిధ గ్రామాల మహిళలు ఉపవాస దీక్షలతో వచ్చి మొక్కులు చెల్లించారు. నిర్వాహకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించండి



రోడ్డు భద్రతా వారోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న ఎంవీఐ సుప్రియ

పుంగనూరు: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుప్రియ కోరారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకరయ్య, వైఎస్సార్ ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు జయరామిరెడ్డి, సిబ్బంది, డ్రైవర్లతో కలసి రోడ్డు భద్రతా వారోత్సవాల అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంవీఐ మాట్లాడుతూ, ప్రతి వాహనదారుడు అన్ని రికార్డులు, లైసెన్సు కలిగి ఉండాలన్నారు. మితిమీరిన వేగం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్, ఓవర్ టేక్ చేయడం.. ఇత్యాది కారణాలు ప్రమాదాలకు కారణమవుతున్నట్టు చెప్పారు. అలాగే ఇటీవల కాలంలో మైనర్లు కూడా మోటార్ సైకిళ్ల నడుపుతున్నారని, వారు పట్టుబడినా, ప్రమాదాలకు కారణమైనా వారి తల్లిదండ్రులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మైనర్లకు బైక్స్ ఇవ్వరాదని, ఇస్తే మాత్రం భారీమూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందనేది గుర్తెరగాలని హితవు పలికారు.

వైద్యానికి ఆర్థిక సాయం



క్యాన్సర్ రోగికి నగదు సాయం చేస్తున్న అశోక్

పలమనేరు: మండలంలోని మొరం గ్రామానికి చెందిన సర్వీస్ టు సొసైటీ నిర్వాహకులు, సాఫ్ట్‌వేర్ అశోక్ బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న వ్యక్తికి చికిత్స నిమిత్తం రూ.10వేలను అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన రామారావు బ్లడ్‌క్యాన్సర్‌తో బాధ పడుతున్నాడని, వైద్యానికి డబ్బుల్లేక ఇబ్బంది పడుతున్నారని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న ఆయన సోమవారం హైదరాబాద్‌కు వెళ్లి అతడికి సాయం చేశారు. ఇంకనూ మరికొందరితో సాయాన్ని అందిస్తామని తెలిపారు.

వీధి కుక్కల కట్టడికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ అముద

చిత్తూరు అర్బన్: నగరంలో వీధి కుక్కల కట్టడికి తగిన చర్యలు తీసుకుంటామని నగర మేయర్ అముద, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, రాజేష్ కుమార్ రెడ్డి చెప్పారు. నగరంలో ఆదివారం పిచ్చికుక్క దాడిలో 40 మంది గాయపడిన ఘటన బాధాకరమన్నారు. ఈ ఘటనకు సంబంధించి సోమవారం మేయర్ తన చాంబర్‌లో మున్సిపల్ హెల్తాఫీసర్ లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో సమావేశమై చర్చించారు. వీధి కుక్కల నియంత్రణకు తగిన ప్రణాళిక సిద్ధం చేసి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అన్ని వార్డుల్లో వీధి కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేయించాలన్నారు. కుక్కల సంతతి పెరగకుండా చికిత్స చేయించనున్నట్లు తెలిపారు. ఇందులో చట్టపరమైన ఇబ్బందులు వస్తున్నాయని, వాటిని అధిగమించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆదివారం నాటి ఘటనలోనూ నగరపాలక కమిషనర్, ఇతర అధికారులు వేగంగా స్పందించి చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. మున్ముందు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలన్నారు.

కుష్ఠు రహిత సమాజానికి కృషి

కార్వేటినగరం: కుష్ఠువ్యాధి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు కోరారు. కత్తెరపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో సోమవారం కుష్ఠువ్యాధిగ్రస్తులకు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం హేమారెడ్డి పాదరక్షలు, పంచెలు, చీరలు వితరణ చేశారు. డాక్టర్ రవిరాజు మాట్లాడుతూ వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి కుష్ఠు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి ప్రాథమిక దశలోనే వైద్య సేవలు అందించాలన్నారు. హెచ్‌ఎం హేమారెడ్డి మాట్లాడుతూ కుష్ఠురోగులపై వివక్ష చూపరాదన్నారు. కార్యక్రమంలో తుడా ప్లానింగ్ విశ్రాంత అధికారి కృష్ణారెడ్డి, డాక్టర్ హేమశ్రీ, సీహెచ్‌వో రాజేశ్వరి, పర్యవేక్షకులు త్యాగు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరా సభ జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

- ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీలో ఈనెల 14న నిర్వహించనున్న వైఎస్సార్ ఆసరా బహిరంగ సభను నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, స్వయం సహాయక సంఘాల మహిళలు జయప్రదం చేయాలని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ కోరారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పట్టణ నేతలతో సోమవారం ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఆసరా చెక్కుల పంపిణీఈ కార్యక్రమంలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు. గత టీడీపీ పాలనలో డ్వాక్రా గ్రూపు మహిళలకు చంద్రబాబు మోసం చేశారన్నారు. రుణమాఫీ చేస్తానంటూ వారికి శఠగోపం పెట్టారని, అందుకే మహిళలు ఆయనకు ఎన్నికల్లో బుద్ధి చెప్పారన్నారు. మళ్ళీ ఎన్నికలు సమీపించడంతో రాష్ట్రంలోని మహిళలను మరోసారి ఏమార్చేందుకు చంద్రబాబు సిద్ధమయ్యారని, ఆయన మాయమాటలను నమ్మరాదన్నారు. గతంలో చంద్రబాబు ప్రజలకు హామీలతో చేసిన వంచన, ఇప్పుడు జగనన్న పాలనలో జరిగిన మంచిని గుర్తు చేసేందుకే ఈ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

నేడు గంగవరంలో..

గంగవరం: మండలంలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు మంగళవారం 4వ విడత వైఎస్సార్ ఆసరా చెక్కులను ఎమ్మెల్యే వెంకటేగౌడ పంపిణీ చేయనున్నారు. స్థానిక సాయిబాబా ఆలయ ప్రాంగణంలోని మైదానంలో దీనికి సంబంధించిన ఏర్పాట్లను సోమవారం పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు గిరిరాజారెడ్డి నాయకులతో కలిసి పరిశీలించారు.

16నుంచి కాశీవిశ్వేశ్వరుని బ్రహ్మోత్సవాలు

- ఎమ్మెల్యేను ఆహ్వానించిన ఆలయ కమిటీ



ఆలయ బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న కమిటీ సభ్యులు

పలమనేరు: పట్టణంలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 16 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ వీరభద్ర, కార్యనిర్వహణాధికారి కమలాకర్ తెలిపారు. ఆలయ బ్రహ్మోత్సవాల పత్రికను సోమవారం స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడకు అందజేసి ఆయనను ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ, 16న గణపతి ఉత్సవం, 17న హంసవాహనం, 18న అధికార నందివాహనం,19న సింహవాహనం, 20న శేషవాహనం, 21న గజవాహనం, 22నఅశ్వవాహనం , 23న గిరిజాకళ్యాణం, 24న బ్రహ్మ రథోత్సవం, 25న రావణ బ్రహ్మవాహనం, 26న శయనోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గోపాల్ రెడ్డి, హేమంత్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని గెలిపించండి



మొరసనపల్లెలో పార్టీ నాయకులతో పద్మజ



సీసీ రోడ్డు పనులకు పూజ చేస్తున్న నాయకులు

శాంతిపురం: రానున్న ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్సీ భరత్ తల్లి పద్మజ కోరారు. సోమవారం ఆమె మొరసనపల్లె పంచాయతీలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. కుప్పం నియోజకవర్గంలో పార్టీని గెలిపించడం ద్వారా పార్టీ దివంగత నాయకుడు, తన భర్త చంద్రమౌళి కలను సాకారం చేయాలని కోరారు. 2014 నుంచి స్థానికంగా అందుబాటులో ఉంటూ కార్యకర్తల కష్టసుఖాల్లో ఆయన తోడుగా ఆయన నిలిచారని గుర్తు చేశారు. 2019 ఎన్నికల సమయంలో అనారోగ్యం మూలాన ఆయన మంచానికే పరిమితమై ప్రచారం చేయలేని పరిస్థితిలో ఉన్నప్పటికీ దాదాపుగా 70 వేల మంది ఓటు వేశారని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు కుప్పంలో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ జగదీష్, ఎంపీటీసీలు ఆర్ముగం, బీఎస్ వెంకటేష్, నాయకులు వరదరాజులు, గోవిందప్ప, జానకిరాం, మణి, కవిత, జలమప్ప, కొండన్న పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

శాంతిపురం: అబకలదొడ్డి పంచాయతీలోని కాకర్లవంకలో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. తమకు సిమెంటు రోడ్డు కావాలని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ భరత్‌ను స్థానికులు కోరారు. దీనిపై స్పందించిన ఆయన జీజీఎంపి నిధుల నుంచి రూ.10 లక్షలను మంజూరు చేయించడంతో సీసీ రోడ్డు పనులు మొదలు పెట్టారు. ఎమ్మెల్సీ భరత్ తల్లి పద్మజ, పార్టీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, వైస్ ఎంపీపీ పట్టాభి, నాయకులు ఆర్ఎంకె మురుగన్, మురుగేష్, వీరప్ప, రజనీకాంత్, మణి, మోహన్, పెరుమాల్, గణపతి పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షపై అవగాహన ముఖ్యం



మాట్లాడుతున్న ఎంపీపీ వరలక్ష్మి

గుడుపల్లె: జగనన్న ఆరోగ్య సురక్షపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీపీ వరలక్ష్మి కోరారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఏఎన్‌ఎంలతో ఆరోగ్య సురక్షపై ఎంపీపీ సమీక్షించారు. మొదటి విడతలో ఆరోగ్య సురక్ష విజయవంతమైందని, ప్రస్తుతం గ్రామాలలో 2వ విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రజలకు సరైన వైద్య సేవలు అందడం లేదని పేర్కొన్నారు. ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించే గ్రామాలలో ఎక్కువ మంది వైద్య పరీక్షలకు వచ్చేలా ముందస్తు ప్రచారం చేయాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలను అనుగుణంగా వైద్యం ప్రజల చెంతకు చేర్చే బాధ్యత వైద్యులపై ఉందన్నారు.

వైఎస్సార్‌టీఎఫ్ క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, వైఎస్సార్ టీఎఫ్ నాయకులు

పలమనేరు: రాష్ట్రంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందని గంగవరం ఎంఈఓ వేణు గోపాల్ రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ కార్యాలయంలో సోమవారం ఆయన వైఎస్సార్‌టీఎఫ్–2004 క్యాలెండర్లను నేతలతో కలసి ఆవిష్కరించి మాట్లాడారు. నాడు–నేడుతో ప్రభుత్వ స్కూళ్లు బలోపేతమయ్యాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు అందివ్వాల్సిన బాధ్యత టీచర్లపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీఎఫ్ గౌరవాధ్యక్షులు సోమచంద్రారెడ్డి, నాయకులు పుష్పావతి, కుమార్, రోషన్‌అలీ, సదాశివ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సారా స్థావరాలపై పోలీసుల దాడి

- 3 వేల లీటర్ల ఊట ధ్వంసం



సారా బట్టీ, డ్రమ్ములను ధ్వంసం చేస్తున్న పోలీసులు

రామకుప్పం: మండలంలోని గుట్టూరుతండా, చిక్కపల్లితండా, బాలాజీ కుంట అటవీ ప్రాంత గ్రామ సరిహద్దులో సోమవారం కుప్పం స్పెషల్ బ్రాంచ్, రామకుప్పం పోలీసులు సంయుక్తంగా సారా స్థావరాలపై దాడులు చేశారు. ఈ దాడుల్లో 3 వేల లీటర్ల సారా ఊటతోపాటు సారా బట్టీలు, ప్లాస్టిక్ డ్రమ్ములను ధ్వంసం చేశారు. సారా అక్రమ తయారీకి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.